# కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న కేంద్రం

- కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు వెల్లువ
- భారీగా పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు,కార్మికులు
- పలు చోట్ల ప్రధాని దిష్టిబొమ్మ దహనం



మల్కాజిగిరి చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీఐటీయూ, ఏఐటీయూ నాయకుల ర్యాలీ

మేడ్చల్, ఫిబ్రవరి 5: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్మికులు, రైతులకు మొండి చేయి చూపిస్తుందని సీఐటీయూ జిల్లా నేత ఎంపీ నరేశ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలకు రాయితీలిచ్చి, సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలకు తగిన బడ్జెట్ కేటాయించడం లేదన్నారు. ప్రస్తుతం కేంద్రం ప్రవేశపెట్టిన రూ.50,65,345 కోట్ల బడ్జెట్‌లో జీడీపీ లోటు 4.4 శాతం చూపారని, ఇది ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు బడ్జెట్‌లో లేకపోవడంఅన్యాయమన్నారు. తెలంగాణ ఏర్పడ్డ 10 ఏండ్ల తర్వాత కూడా పరిష్కరించే చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. రైతు రుణమాఫీ, ధరల స్థిరీకరణ, ఉపాధి పథకానికి నిధుల పెంపును విస్మరించిందన్నారు. విద్యుత్ రంగ సంస్కరణలతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు తీవ్ర హామీ కల్గుతుందన్నారు. లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనం రూ.26 వేలు, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం వంటి అంశాలను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం కార్మిక వ్యతిరేక చర్య అన్నారు. కార్పొరేట్ విధానాలు, సంపన్నుల ప్రయోజనాలే ప్రాధాన్యతగా ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌ను తాము వ్యతిరేకిస్తున్నామని, రాష్ట్ర ప్రజలకు తీవ్రంగా నిరసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు నర్సింగ్ రావు, కిరణ్, రోహిత్ యాదవ్, దేవేందర్, రమేశ్, చింటూ నర్సింహ, టీయూసీఐ నాయకులు ఖాజా, కృష్ణ, హలీమ్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

● శామీర్‌పేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తో కార్మికులు, కర్షకులకు ఎలాంటి ఉపయోగం లేదని సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు అన్నారు. బడ్జెన్‌ను నిరసిస్తూ శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి డీజీ.సాయిలుగౌడ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.జంగయ్య, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.దశరథ్, సీఐటీయూ మండల కార్యదర్శి కిష్టప్ప, రైతు సంఘం నాయకులు డీజీ.నరేంద్రప్రసాద్, నర్సింహ, బాబు, ఏఐటీయూసి నరేందర్‌చారి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

● మల్కాజిగిరి: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక బడ్జెట్ వల్ల సామాన్య ప్రజలు, కార్మికులకు ఉపయోగకరంగా లేదని సీఐటీయూ, ఏఐటీయూ నాయకులు అన్నారు. బుధవారం మల్కాజిగిరి చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా కార్మిక నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ రెడ్డి, కృపాసాగర్, లక్ష్మణ్, నాగరాజు, సుమిత్ర, కృష్ణ మూర్తి, సయ్యద్ గౌస్, శంకర్,నాగమణి, నర్సింగ రావు,భూమయ్య, శ్రీనివాస్, మల్లికార్జున్, చిట్టిబాయ్, సుజాత, అలివేలు, మాధవి, లాలి పాల్గొన్నారు.

● కాప్రా: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలు రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మికసంఘాల పిలుపులో భాగంగా బుధవారం ఈసీఐఎల్ కమలానగర్‌లోని సీఐటీయూ ఆఫీసు నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు కార్మిక సంఘాలు నిరసన ర్యాలీ నిర్వహించాయి. ఈ నిరసన ర్యాలీలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.చంద్రశేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్‌రావు, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు శివబాబు, సీఐటీయు జిల్లా సహాయకార్యదర్శి జి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు పి.గణేశ్, బీవీ సత్యనారాయణ, కోశాధికారి ఉన్నికృష్ణ, కార్మికులు పాల్గొని కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు లక్ష్మీనారాయణ, జిల్లా ఆశ వర్కర్స్ ప్రధాన కార్యదర్శి రేవతి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పల్: సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మికులు ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు బుధవారం ఉప్పల్ రింగ్ రోడ్డులో కార్మిక సంఘాల ప్రతినిధులు నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలపై, 4లేబర్ కోడ్లను రద్దు చేయాలని, రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈనెల 10న జరిగే ఇందిరాపార్కు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ కార్మిక నేతలు జే.వెంకన్న, ఉర్మిళ, ఆంజనేయులు, వెంకటేష్, రవి, పట్టాభిరామయ్య, నరసింహ, పరమేష్, జంగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అఫ్జల్, మధు, రామచంద్ర, నాగరాజు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

**చలో ఢిల్లీ గోడ ప్రతిక ఆవిష్కరణ**

● ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వం వికలాంగులకు పింఛ న్ పెంచడంతో పాటు అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు కోయ్యడ చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ పట్టణంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న చేపట్టిన ఛలో ఢిల్లీ గోడ పత్రికను బుధవారం ఆవిష్కరించారు. ప్రతి వికలాంగునికి రూ. 5 వేల ఫించన్, అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు నిరజారెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.


ఉప్పల్ రింగ్ రోడ్డులో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాలు

## అజయ్ కుటుంబానికి అండగా ఉంటాం


మృతుడు అజయ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

మేడ్చల్‌కలెక్టరేట్, ఫిబ్రవరి 5: అజయ్ కుటుంబానికి అండగా ఉంటామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గతనెల 26న ట్యాంక్ బండ్‌పై నిర్వహించిన భాగ్యనగరానికి మహాహారతి కార్యక్రమంలో నాగారం పట్టణానికి చెందిన అజయ్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బుధవారం నాగారంలోని అజయ్ నివాసానికి కిషన్ రెడ్డి విచ్చేసి కుటుంబ సభ్యులను పరమర్శించారు. అజయ్ చిత్ర పటానికి కిషన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరత మాత ఫౌండేషన్ వారు అజయ్ కుటుంబానికి రూ. 20లక్షల అందజేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు విక్రం రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అర్చన కాలనీ సమస్యలు పరిష్కరించాలి


కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

మేడ్చల్, ఫిబ్రవరి 5: అర్చన కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కమిషనర్ నాగిరెడ్డికి కాలనీవాసులు వినతి పత్రం సమర్పించారు. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు లేని కారణంగా కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అర్చన సేవా సమితి అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బుచ్చి రాములు, కోశాధికారి మన్మథరావు, కార్యవర్గ సభ్యుడు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

ఘట్‌కేసర్, జనవరి 5: గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న ఘటన ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘట్‌కేసర్ పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి గుట్టు చప్పుడు గాకుండా తీన్ పత్తా పేకాట ఆడుతున్నారు. విషయం తెలుసుకున్న ఘట్‌కేసర్ పోలీసులు దాడి జరిపి ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన పి రాజు, ఏ రాంబాబు, ఏ సుధాకర్, ఏ బాబు, యస్ యశ్వంత్, ఎం ఆదినారాయణ, ఎస్.మోహన్‌లను అరెస్టు చేసి రూ.1 లక్షా 69 వేల నగదుతో పాటు మొబైల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డు సెట్ లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల ప్రదర్శన

మేడ్చల్ రూరల్, ఫిబ్రవరి 5: మున్సిపాలిటీల్లో పని చేసే ఉద్యోగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో ప్రదర్శన నిర్వహించి, అనంతరం మున్సిపల్ కమిషనర్ స్వామికి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ వేతన సవరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వమే వారికి వేతనాలు చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశాడు. జనాభాకు అనుకూలంగా కార్మికులను పెంచాలని, లేని ఎడల సమ్మె చేయడం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రమేష్, కిరణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణాలను పాటించని పరిశ్రమలను మూసివేయాలి


చర్లపల్లి పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం జరిగిన సర్వోదయ కెమికల్ ఫ్యాక్టరీ లోపలి భాగాలను పరిశీలిస్తున్న సీపీఐ బృందం

కాప్రా, ఫిబ్రవరి 5: ప్రమాణాలు పాటించని పరిశ్రమలను మూసివేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) డిమాండ్ చేసింది. మంగళవారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని సర్వోదయ కెమికల్ ఫ్యాక్టరీ అగ్నిప్రమాదం బారిన పడగా, సదరు కంపెనీని సీపీఐ ఉప్పల్ నియోజకవర్గం బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న రసాయనాల ఉత్పత్తి పరిశ్రమల్లో యాజమాన్యాల నిర్లక్ష్యం ఉందనీ, వీరి నిర్లక్ష్యం కారణంగానే తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని విమర్శించారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు నిర్దిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గసభ్యులు శంకర్‌రావు, సీపీఐ నేతలు నర్సింహ, నర్సింగ రావు, స్వామిదాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

చర్లపల్లి, ఫిబ్రవరి5: ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 30లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర యంగ్ లీడర్స్ ఉపాధ్యక్షుడు బూడిద ప్రేమ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు బుధవారం వినతిపత్రం అందజేసి సమస్యను ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యంగ్ లీడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేసిన రాష్ట్ర యంగ్ లీడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

## ఎస్సీ వర్గీకరణ అయ్యే వరకు ఉద్యమం ఆగదు


ర్యాలీని ప్రారంభించిన మాజీ మేయర్ మేకల కావ్య

జవహర్‌నగర్, ఫిబ్రవరి 5: ఎస్సీ వర్గీకరణ జీవో జారీ అయ్యేవరకు ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆగదని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివకుమార్ హెచ్చరించారు. లక్ష డప్పుల..వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివకుమార్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ఫైరింగ్‌రేంజ్ నుంచి బాలాజీ నగర్ ప్రధాన చౌరస్తా వరకు బుధవారం డప్పులు, కళాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కుతాడి శ్రీనివాస్, శ్రీకాంత్‌యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, పానుగంటి బాబు, నాయకులు సదానంద్, వినయ్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేష్, తూటి శ్రీనివాస్, ఎల్లస్వామి, పరశురామ్, కుమార్, యాదగిరి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గురుకుల్‌ను కాపాడుకునేందుకు కృషి చేయాలి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 01: గురుకుల్‌ను కాపాడుకునేందుకు పూర్వ విద్యార్థులు సమిష్టిగా కృషి చేసినప్పుడే సాధ్యం అవుతుందని ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ కొత్తకొండ వెంకటేశ్ అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో దశాబ్దాల క్రితం స్థాపించబడి ఎంతో మందికి ఉజ్వల భవిష్యత్ అందించిన గురుకుల కళాశాలను కాపాడుకునేందుకు పూర్వ విద్యార్థులు చేపట్టిన ఉత్తరాల ఉద్యమంలో భాగంగా బుధవారం ఉత్తరాలను స్పీడ్ పోస్టు చేశారు. మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్తరాల ఉద్యమంలో భాగంగా సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఉత్తరాలను పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌కుమార్, శశిధర్, శ్రీనివాస్ గౌడ్, వీరేందర్, మురళీకృష్ణ పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ పోస్టాఫీసు వద్ద ఉత్తరాలను పోస్టు చేస్తున్న వెంకటేశ్ తదితరులు

## నాగారం అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నాగారం అటవీ ప్రాంతంలో 700 ఎకరాల్లో నీలగిరి చెట్లు ఉన్నాయి. ఎండిపోయిన కొమ్మలు, ఆకులకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో బుధవారం మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న కీసర ఫారెస్ట్ రేంజ్ అధికారి విష్ణువర్ధన్ రావు, సిబ్బంది అగ్నిమాపక శకటానికి సమాచారం అందించారు. అగ్నిమాపక శకట సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసున్నారు. రెండు రోజులుగా మంటలను అర్పివేస్తున్నామని, మంటల పూర్తిగా అదుపులోకి వచ్చాయనిఫారెస్ట్ అధికారి విష్ణువర్ధన్ రావు అన్నారు.


మంటల్లో కాలిపోయిన చెట్లు

## కార్పొరేటర్‌ను కలిసిన ఉప్పల్ ఏఎంహెచ్‌ఓ

ఉప్పల్, ఫిబ్రవరి 5: ఉప్పల్ సర్కిల్ ఏఎంహెచ్ఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రంజిత్ బుధవారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు కార్పొరేటర్ కార్యాలయంలో డాక్టర్ రంజిత్‌ను శాలువాతో సత్కరించారు. సర్కిల్ పరిధిలోని పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని, తమవంతు సహకారం అందజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.


ఏఎంహెచ్‌ఓను సత్కరిస్తున్న కార్పొరేటర్ బన్నాల

# భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు

- కీసరగుట్ట బ్రహ్మోత్సవాలపై చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి సమీక్షా
- కోటి 50 లక్షలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి వినతి



కలెక్టరేట్‌లో కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పాల్గొన్న అధికారులు

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 5: కీసరగుట్ట మహ శివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే సామాన్య భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 24 నుంచి మార్చి 1వ తేదీ వరకు కీసరగుట్టలో జరిగే మహ శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు 7 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని వివిధ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలని అన్నారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ టిక్కెట్ల ద్వార స్వామి దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేయాలని, దర్శనానికి ఏర్పాటు చేసిన 6 క్యూలైన్లలో మూడు క్యూలైన్లను సామాన్య భక్తుల దర్శనం కోసం ఏర్పాటు చేయాలని, శీఘ్రదర్శనం, అభిషేకం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులకు తాగు నీరు సౌకర్యం కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చలువ పందిళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్, బారికేడింగ్ ఉండాలని అన్నారు. అవసరమైన చోట్ల మరుగుదొడ్లు,తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. అంబులెన్స్, వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. కొలను,చెరువుల వద్ద గజ ఈతగాళ్లను ఉంచాలని, ఆలయ పరిస ప్రాంతాల్లో అగ్ని మాపక సిబ్బంది ఫైర్ ఇంజన్లు అందుబాటులోఉంచాలనితెలిపారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా పోలీసులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, పోలీస్ శాఖ వారు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. బ్రహ్మోత్సవాలకు రూ. కోటి 50 నిధులు మం జూరు చేయాలని మాజీ మంత్రి, మేడ్చ ల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మ హేందర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధికాగుప్తా, డీఆర్ఓ హరిప్రియ, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఆర్డీఓ వెంకట ఉపేందర్ రెడ్డి, ఆలయచైర్మన్ తటాకం నారాయణ శర్మ, ఈఓ సుధాకర్ రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 8న శామీర్‌పేటలో జాబ్ మేళా

శామీర్‌పేట, ఫిబ్రవరి 5: నిరుద్యోగ యువతి యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎం పీడీవో మమతాభాయి బుధవారం కోరారు. ఈ నెల 8న ఉదయం 10 గంటలకు శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. మండల పరధిలోని 7గ్రామ పంచాయతీలో 18 నుంచి 30లోపు మధ్య వయస్సు ఉనన్న యువతి, యువకులు అర్హులన్నారు. పూర్తి వివరాల కోసం మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## నిధులు మంజూరు చేయాలి

రామంతాపూర్, ఫిబ్రవరి 5: రామంతాపూర్ డివిజన్‌లోని వెంకటసాయినగర్ కాలనీకి అడ్డంగా ఉన్న మూసి నాలాపై బాక్స్ కల్వర్ట్ కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం కాలనీ వాసీ విజయేందర్‌రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్ ఇంలబర్తీకి వినతి పత్రం సమర్పించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పీర్జాదిగూడ, ఫబ్రవరి5: మేడిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు విద్యుత్ ఫీడర్ల ప్రాంతాల్లో గురువారం ఉదయం11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ హరినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్ నగర్‌కాలనీ, మల్లికార్జున్ నగర్‌కాలనీ, భరత్‌పురి కాలనీ, కమలానగర్, విశ్వం విహార్ కాలనీ, సుమా రెసిడెన్సీ, గురుఎన్‌క్లేవ్, అయోధ్య కాలనీ, భగత్‌సింగ్ నగర్‌కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కీసర: నాగారం మున్సిపాల్టీ పరిధి కరీంగూడ 11కేవీ ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ కోత విధిస్తున్నామని ఏఈ మురళీకృష్ణ తెలిపారు. రాంపల్లి సబ్‌స్టషన్ పరిధిలోని కరీంగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరీంగూడ గ్రామం, శిల్పవెంచర్, తారక ఎన్‌క్లేవ్, కాకతీయ ఎన్‌క్లేవ్, శుభకర ఎన్‌క్లేవ్, అక్షయ ఎన్‌క్లేవ్, సాహితి ఎన్‌క్లేవ్,లోటస్ ఎన్‌క్లేవ్, చంద్ర ఎన్‌క్లేవ్, రాజీరెడ్డి ఎన్‌క్లేవ్, మైత్రీ నగర్, భగవాన్ కాలనీ, గ్రీన్ సిటీ, నక్షత్ర ఎన్‌క్లేవ్, లెజెండ్ కాలనీ, నీలగిరి కాలనీల్లో విద్యుత్ కోత విధిస్తున్నామన్నారు.

## యువతి అదృశ్యం


వర్ష(ఫైల్)

మల్కాజిగిరి,ఫిబ్రవరి 5: యువతి అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం... వీనపాణినగర్‌కు చెందిన వర్ష (35)కొంత కాలంగా మానసిక సమస్యలతో చికిత్స పొందుతుంది. బుధవారం ఉద యం దగ్గరలోని ఆలయానికి వెళ్లింది. రాత్రికి తిరిగి రాలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో సోదరుడు ఆశీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మండల ట్రస్మా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన ఉప్పల్ ట్రస్మా నూతన కార్యవర్గ ప్రతినిధులు

రామంతాపూర్,ఫిబ్రవరి 5: ఉప్పల్ మండల ట్రస్మా విభాగం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం బుధవారం రామంతాపూర్ ఎస్పీ గ్రామర్ స్కూల్‌లో జరిగింది. నూతన అధ్యక్షులుగా పరివేద వెంకటేశ్వరావు,ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీధర్ కోశాధికారి కల్లూరి కిరణ్ కుమార్‌రెడ్డి,ఉపాధ్యక్షులు కబీర్,భాస్కర్‌రెడ్డి,సుధాకర్‌రెడ్డి,గడ్డం వెంకటసాయి,సహాయ కార్యదర్శులుగా కరుణాకర్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, సత్యనారాయణ,తేజేశ్వర్‌రావు,కిరణ్‌కుమార్, సలహాదారులుగా సిరిపురం ఉపేందర్,శీలం సోమశేఖర్,ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర్‌రెడ్డి, పీవీ రాంనర్సయ్య,హనుమంతారెడ్డి, సూరం రాంరెడ్డి,వేముల కొండ సోమశేఖర్‌గౌడ్,వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ పనులు వేగవంతం


చర్లపల్లి, ఫిబ్రవరి5: కుషాయిగూడ బస్టాప్‌లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన పనులను వేగవంతం చేస్తున్నామని విగ్రహస్థాపన సభ్యులు, బీఆర్ఎస్ సినీయర్ నాయకుడు సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు కాసుల సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డిలు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కుషాయిగూడ బస్టాప్‌లో ఏర్పాటు చేస్తున్న హనుమాన్ విగ్రహప్రతిష్ఠాపన పనులను వారు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహప్రతిష్ఠాపన కోసం విరాళాలు అందజేయాలని వారు కోరారు. అనంతరం కుషాయిగూడకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకట్‌రెడ్డి రూ.72వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు మచ్చ లక్ష్మణ్‌గౌడ్, తాళ్ల ఆనంద్‌గౌడ్, సారా వినోద్, గంప కృష్ణగుప్తా, గణేశ్‌లతో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక వైద్యసేవలు అందేలా చూడాలి


సమావేశానికి హాజరైన ప్రతినిధులు

ఉప్పల్, ఫిబ్రవరి 5: నాచారం ఈఎస్ఐ దవాఖానలో బుధవారం హెచ్‌డీసీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపరింటెండెంట్ డాక్టర్ గీత, ఈఎస్ఐసీ బోర్డు మెంబర్ వేముల మారయ్య, తదితర సభ్యులు హాజరైనారు. ఈసందర్భంగా ఆధునిక వైద్యసేవలు అందేలా చూడాలని, కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని, నిధుల కొరత లేకుండా చూడాలని బోర్డు సభ్యులు వేముల మారయ్య కోరారు. అదేవిధంగా నాచారం ఈఎస్ఐలో తక్షణమే సిటీస్కానింగ్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి


తిమ్మాయిపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో విజయకుమారి

కీసర, ఫిబ్రవరి 5: విద్యార్థులకు మెరుగైన బోధనతో అందించాలని జిల్లా విద్యాధికారి విజయకుమారి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధి తిమ్మాయిపల్లి ప్రభుత్వ పాఠశాలను బుధవారం జిల్లా విద్యాధికారి విజయకుమారి సందర్శించారు. పాఠశాలో చదువుతున్నవిద్యార్థుల ఎఫ్ఎల్ ఎన్ ప్రగతి, పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో జగన్‌మోహన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అవినాష్, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 5: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మల్కాజిగిరి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు అన్నారు. బుధవారం మల్కాజిగిరి డిగ్రీ కాలేజీ విద్యార్థి ఉమేశ్‌ను ప్రిన్సిపల్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు మాట్లాడుతూ ఉప్పల్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లా క్రీడల్లో మల్కాజిగిరి డిగ్రీ కాలేజీ బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఉమేష్ వంద మీటర్ల పరుగులో ప్రథమ బహుమతి,బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి బాను షెటిల్‌లో ద్వితీయ బహుమతి సాధించడంతో వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పీడీ డాక్టర్ ప్రదీప్, డాక్టర్ అహల్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు తదితరులు అభినందించారు.


విద్యార్థి ఉమేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు